క్లుప్తంగా

వైభవంగా కోటేశ్వరుడి గ్రామోత్సవం



సంగం: మండలంలోని దువ్వూరులో గంగా పార్వతి సమేత కోటేశ్వరుడి గ్రామోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా గంగాపార్వతి సమేత కోటేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా రమేష్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

భూపంపిణీకి సర్వం సిద్ధం

ఉదయగిరి: భూపంపిణీ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయలలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 17 పంచాయతీలకు గానూ 8 పంచాయతీల్లో భూపంపిణీ లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసినట్లు చెప్పారు. చొడేపల్లి, కొండాయపాళెం, సున్నంవారి చింతల, కృష్ణంపల్లి, గుడినరవ, అప్పసముద్రం, శకునాలపల్లి, కుర్రపల్లి పంచాయతీల పరిధిలో 77.83 ఎకరాల భూమిని 44 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నాణ్యత పాటించాలి



ఉదయగిరి: మనబడి నాడు–నేడు రెండో విడత పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతి పూర్తి చేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి సూచించారు. వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వాటర్‌ట్యాంక్, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బ్రహ్మంగారికి విశేష పూజలు



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో గురువారం పదహారు రోజుల పండగను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పంటకోత ప్రయోగం



సోమశిల: అనంతసాగరం రైతు భరోసా కేంద్రం–2 పరిధిలోని రైతు ప్రవీణ్‌కు చెందిన వరి పొలంలో గురువారం పంట కోత ప్రయోగం చేపట్టారు. నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించేందుకు పంట కోత ప్రయోగం చేపట్టినట్లు మండల గణాంకాధికారి మోహన్‌కిషోర్ తెలిపారు. ఎకరాకు 3 నుంచి 3.5 పుట్ల ధాన్యం దిగుబడి వచ్చిందని వివరించారు. వీఏఏ యశోద, బీమా అధికారి సాయితేజ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం



సంగం: అమరపనాయుడుకండ్రికలో తన తల్లి లగడపాటి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ గురువారం ప్రారంభించారు. తొలుత కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధాశ్రమానికి చేరుకున్న ఆయన కృష్ణ మందిరం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని గదులను ప్రారంభించారు. గోశాలను సందర్శించి గోవులకు ఆహారం అందజేశారు. అనంతరం కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువను పరిశీలించి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



జలదంకి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి ఏ, బీ పరీక్ష కేంద్రాలను ఆయా కేంద్రాల చీఫ్ అధికారులు పీ మాధవరావు, సీహెచ్ జయభారతి గురువారం పరిశీలించారు. ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అవసరమైన వసతులు సక్రమంగా ఉన్నాయా..లేదాని పరిశీలించారు. ఏ సెంటర్‌లో 187 మంది, బీ సెంటర్‌లో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట డిపార్ట్‌మెంటల్ అధికారులు సంపత్ కృష్ణ, పురుషోత్తం, హెచ్‌ఎం కొండారెడ్డి ఉన్నారు.

వైభవంగా శ్రీమహాలక్ష్మి గ్రామోత్సవం



గజ వాహనంపై ఊరేగుతున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారు

కావలి రూరల్ : ముసునూరులోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. శ్రీమహాలక్ష్మిని శ్రీశైలం దేవస్థానం పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయంలో భాగంగా ఉగాది సందర్భంగా శ్రీమహాలక్ష్మి తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

చెన్నకేశవస్వామికి గరుడ వాహనం బహూకరణ



సంగం: ఉడ్‌హౌస్‌పేటలోని చెన్నకేశవస్వామి ఆలయానికి ఎస్వీపాళెం మాజీ సర్పంచ్ కట్టిపల్లి భవానీ సింహాద్రిరావు, కట్టిపల్లి ప్రసాద్ భాగ్యలక్ష్మి, ఉక్కాల వెంకటప్రసాద్ స్రవంతి, రాపూరు మహేష్ సంధ్య కంచు గరుడ వాహనాన్ని గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సింహాద్రిరావు మాట్లాడుతూ తమ స్వగ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి గరుడ వాహనం సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కట్టిపల్లి ప్రకాశం, ఉక్కాల చిరంజీవి, ఉక్కాల చినరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఉదయగిరి: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, సుధాకర్ మాట్లాడుతూ రెండు, వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, తదితర లక్షణాలు ఉంటే క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నివారణకు చికిత్స పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. 2025 నాటికి దేశాన్ని క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సూపర్‌వైజర్లు అక్బర్‌బాషా, చెన్నయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉదయగిరి: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విశ్రాంత ప్రిన్సిపల్ దారపనేని చిన్నవెంగయ్య పేర్కొన్నారు. గండిపాళెంలోని ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ గల్లా మురళీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం సరస్వతి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తేవాలని కోరారు. అనంతరం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు అన్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడులోని వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్లలో గృహ నిర్మాణాలకు కావాల్సిన నీరు, విద్యుత్, తదితర మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. హౌసింగ్ అధికారులు గృహ లబ్ధిదారులకు అందుబాటులో ఉండి గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇనుము, సిమెంట్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగునకు చర్యలు



వేకువన పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కావలి: పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనవాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రంకురోడ్డులో పారిశుధ్య పనులను గురువారం వేకువన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు పారిశుధ్య కార్మికులకు ప్రమాదాలు జరగకుండా పట్టణంలోని ప్రధాన రోడ్లపై వేకువన 4 గంటల సమయంలో వాహనాల రద్దీ లేనప్పుడు పారిశుధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో 364 మంది కార్మికులు ఉండగా, వారిని నాలుగు విభాగాలుగా విభజించి వివిధ ప్రాంతాల్లో విధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే హాజరును గమనిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే స్పందించి 24 గంటల్లో పరిష్కరిస్తున్నామన్నారు.

పోషణ్‌పక్వాడ్‌ను విజయవంతం చేయాలి



వింజమూరు: ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్టు పరిధిలో పోషణ్‌పక్వాడ్‌ను విజయవంతం చేయాలని సీడీపీఓ పద్మావతి కోరారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ్‌పక్వాడ్‌పై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం పోషణ్‌పక్వాడ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు.

విద్యతో ఉజ్వల భవిత



జలదంకి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జలదంకి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి పేర్కొన్నారు. జలదంకి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు సరస్వతిదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ఉత్తమ ఫలితాలను ప్రసాదించాలని వేడుకున్నారు. రాష్ట్రీయ ప్రేరణకర్త నరసింహారెడ్డి పరీక్షల సమయంలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. వాసవీక్లబ్ నిర్వాహకులు స్వీట్లు పంచారు. వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్లు లోకేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు రమేష్, సురేష్, ట్రెజరర్ మురళీమోహన్, రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులు సుబ్బారెడ్డి, వెంకారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్షలు

చేజర్ల : మండలంలోని పలు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఆదూరుపల్లి, 28న చేజర్ల, 31న చిత్తలూరు సచివాలయాల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమీక్ష సమావేశాలు జరుగుతాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు

చేజర్ల: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు పాడి రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి పీ రాజేష్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటి వరకు మండలంలోని 7,200 పశువులకు టీకాలు వేశామని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు పశువులకు గాలికుంటు నివారణ ఉచితంగా టీకాలు వేస్తున్నామని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల్లోని పశువైద్య సహాయకులను సంప్రదించి రైతులు మూడు నెలల వయస్సు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని కోరారు.

పోలీసులకు హెల్మెట్లు



ఉదయగిరి: ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు ఉదయగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న 120 మందికి సిబ్బందికి గురువారం రాత్రి హెల్మెట్లు పంపిణీ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీఐ వీ గిరిబాబు, ఎస్సై ఎన్ ప్రభాకర్ హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు హెల్మెట్లు ధరిస్తే వారిని చూసి వాహనదారులు ధరిస్తారనే ఉద్దేశంతో పంపిణీ చేయడంతో పాటు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

దుత్తలూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం వేకువన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి హుండీలోని నగదు చోరీ చేశారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో ఎస్సై బాజిరెడ్డి తన సిబ్బందితో చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం



దుత్తలూరు: తెడ్డుపాడు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు బాధితులను కాకర్ల ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్‌చౌదరి గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. తలసేమియాతో బాధపడుతున్న తాళ్లూరి అన్విత్‌కు రూ.25 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న నర్రవాడ ప్రసాద్‌కు రూ.20 వేలు, అంగవైకల్యంతో బాధపడుతున్న తాళ్లూరి ప్రణీష్‌కు రూ.10 వేలు, నోటి కేన్సర్‌తో బాధపడుతున్న చెనికల మాలకొండయ్యకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, స్థానికులు నత్తా వెంకటరమణయ్య, గుర్రం కొండయ్య, దారపనేని చెన్నకేశవులు, కాకర్ల రామకృష్ణ, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని పాటించాలి



జలదంకి: సచివాలయ ఉద్యోగులు సమయాన్ని పాటించాలని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణక్రాక-1, 2, కమ్మవారిపాళెం సచివాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఎస్‌డీజీ, ఆయుష్మాన్ భారత్ సర్వే ఈశ్రమ్ కార్డులు, తదితరాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా



వైఎస్సార్ ఆసరాపై అవగాహన కల్పిస్తున్న మెప్మా సీఓ మాధవి

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంతో పొదుపు మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని కౌన్సిలర్ పీ రాధిక, మెప్మా సీఓ మాధవి పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని పంటవీధి సచివాలయంలో వైఎస్సార్ ఆసరాపై పొదుపు మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జగనన్న 2019 ఏప్రిల్ 11 వరకు బ్యాంకుల్లో ఉన్న పొదుపు సభ్యుల రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ మేరకు ఇప్పటి వరకు పట్టణంలోని 17 గ్రూపులకు రెండు విడతలుగా నగదు జమచేశారని తెలిపారు. ఈ నెల 25న మూడో విడతగా రూ.14,68,261 జమ చేయనున్నారని వివరించారు. మెప్మా సిబ్బంది తేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కావలిలో భారీ వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కావలి రూరల్: కావలిలో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లు జలమయమై రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు. చిరువ్యాపారులు సరుకులను కాపాడుకునేందుకు అవస్థ పడ్డారు. గత నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి మండలంలోని కోత దశలోని వరి పంట నేలవాలింది. ఈ నేపథ్యంలో గురువారం కురిసిన వర్షానికి పంట పూర్తిగా నెలకొరిగింది. అకాల వర్షంతో ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

వణికిస్తున్న వాతావరణం

బిట్రగుంట: బోగోలు మండలంలో గురువారం సాయంత్రం వాతావరణం మరోసారి మేఘావృతమైంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవరించి చిన్నపాటి జల్లులు పడడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో కోతకు వచ్చిన వరిపంట నేలవాలింది. సుమారు 150 మంది రైతులకు నష్టం వాటిల్లింది. వర్షం ధాటికి పొలాల్లో చేరిన నీటిని మోటార్లతో బయటకు తోడి పడిపోయిన వరిని నిలబెట్టుకునేందుకు రైతులు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మరోమారు ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీడీఏ శివన్నారాయణ

వరికుంటపాడు: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆత్మ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ శివన్నారాయణ కోరారు. మండలంలోని వరికుంటపాడు, వేంపాడు రైతుభరోసా కేంద్రాల్లో చిరుధాన్యాల సాగుపై రైతులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందని తెలిపారు. రైతులు తక్కువ నీరు, పెట్టుబడులతో రాగి, సజ్జ, కొర్ర, తదితర చిరుధాన్యాలను సాగుచేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలకు డిమాండ్ ఉన్నందున మంచి ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం రామాపురంలో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్త ఓబయ్య, రైతు శిక్షణా కేంద్రం అధికారులు మారుతీదేవి, శిరీషారాణి, శైలజాకుమారి, మాధురి, ఏఓ కిరణ్, వీఏఏ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

కావలి రూరల్: పట్టణంలోని జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సహకారంతో ఆన్‌లైన్ ద్వారా నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు నైపుణ్యశిక్షణ అందించినట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ వీ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు సుబ్రహ్మణ్యంనాయుడు, మాల్యాద్రి, కృష్ణప్రసాద్, విశాలక్ష్మి పాల్గొన్నారు.

వర్మికంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం



పారిశుధ్యంపై శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఆత్మకూరురూరల్: వర్మికంపోస్టు తయారీ ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకోవడంపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి సూచించారు. కరటంపాడులోని ఎల్‌టీసీలో వింజమూరు, అనుమసముద్రంపేట, సీతారామపురం మండలాలకు చెందిన పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు పారిశుధ్యంపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా పంచాయతీల్లో పారిశుధ్యం అమలుకు ప్రత్యేక ప్రణాళికలు అమలుచేస్తున్నామని తెలిపారు. డివిజన్ స్థాయిలో వర్మికంపోస్టు తయారీతో పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకోవడం పై అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆత్మకూరు, సీతారామపురం, వింజమూరు, ఏఎస్‌పేట మండలాల ఎంపీడీఓలు శ్రీనివాసులు, ఐజాక్ ప్రవీణ్, ప్రసన్న, శ్రీనివాసరావు, కరటంపాడు సర్పంచ్ రేవతి, జిల్లా రిసోర్స్‌పర్సన్ ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రేవూరు అంకయ్య, ఎల్‌వీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈఓ చిరంజీవి సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద 599 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 200 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 399 ఇళ్లకు సంబంధించి జియో ట్యాగింగ్‌ను త్వరితగతిన చేపట్టి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరురూరల్: ఏప్రిల్ 6న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే శివభక్తుల కోసం ఆత్మకూరు డిపో నుంచి ప్రత్యేకంగా సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజరు కరిముస్సీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5న ఉదయం 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి బయలుదేరే బస్సుకు రానుపోను టికెట్ ధర రూ.1600గా నిర్ణయించామని చెప్పారు. టికెట్ బుకింగ్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

అమర వీరులకు నివాళి



ఆత్మకూరు: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో దేశస్వాతంత్ర్యం కోసం అతిచిన్న వయస్సులోనే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరులు రాజగురు, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు ఏబీవీపీ నాయకులు గురువారం నివాళులర్పించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, హాస్టల్స్ కన్వీనర్ భరత్ పాల్గొన్నారు.

పోలేరమ్మ గ్రామోత్సవం



సోమశిల: ఉగాది పర్వదినం సందర్భంగా రేవూరులో పోలేరమ్మ గ్రామోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తుల అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు

ఆత్మకూరు: రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుండడంతో మున్సిపల్ పరిధిలోని మసీదులు, దర్గాల వద్ద గురువారం ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, వైఎస్సార్‌సీపీ పట్టణ బూత్ కమిటీ మేనేజర్ సయ్యద్ జమీర్‌తో కలిసి మున్సిపల్ ఏఈ ప్రసాద్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మహబూబ్‌బాషా, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.